సాక్షి
కామారెడ్డి
ఆదివారం । 21 । జనవరి । 2024



బియ్యం పట్టివేత

అక్రమంగా తరలిస్తున్న వంద క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకున్నట్లు సివిల్ సప్లయ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తెలిపారు.

- 8లో ▸



లక్షమందికి సభ్యత్వం

జిల్లాలో జీకేఎస్‌లో లక్ష మంది రైతులకు సభ్యత్వం ఇస్తామని సంఘ్ క్షేత్ర సంఘటన మంత్రి రాము పేర్కొన్నారు.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.2 / 17.7

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. పొగ మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

రేపు పత్తి కొనుగోళ్లు బంద్

మద్నూర్: మండల కేంద్రంలోని సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రంలో సోమవారం పత్తి కొనుగోళ్లు జరగవని మార్కెట్ కమిటీ అధికారి సత్యం తెలిపారు. సోమవారం అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం ఉన్నందున కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పత్తి కొనుగోళ్లకు ఒకరోజు విరామం ఇస్తున్నామని పేర్కొన్నారు. మార్కెట్‌కు సెకండ్ క్వాలిటీ పత్తి వస్తోందని, ఈ నేపథ్యంలో ఈనెల 25వ తేదీ నుంచి మార్కెట్‌కు వచ్చే పత్తికి క్వింటాలుకు రూ. 6,920 చెల్లిస్తామని తెలిపారు. రైతులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

జీహెచ్‌ఎంసీ ఏసీగా పోసానిపేట వాసి



రామారెడ్డి: రామారెడ్డి మండలం పోసానిపేట గ్రామానికి చెందిన సునందరెడ్డి హైదరాబాద్ జీహెచ్‌ఎంసీ అడిషనల్ కమిషనర్‌గా నియమితులయ్యారు. ఆమె పదో తరగతి వరకు రామారెడ్డి ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నారు. తమ గ్రామానికి చెందిన సునంద జీహెచ్‌ఎంసీ అడిషనల్ కమిషనర్‌గా నియమితులవడంపై పోసానిపేటవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

డెయిరీ టెక్నాలజీ కాలేజీ డీన్‌కు ఏరువాక అవార్డు



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి డెయిరీ టెక్నాలజీ కళాశాల డీన్ అమరవాది శరత్‌చంద్రను ఏరువాక ఫౌండేషన్–2023 వ్యవసాయ వార్షిక అవార్డు వరించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయాభివృద్ధికి ప్రత్యక్షంగా, పరోక్షంగా కృషి చేస్తున్న వివిధ రంగాలవారికి తెలుగు వ్యవసాయ మాసపత్రిక 'ఏరువాక' అవార్డులు అందిస్తోంది. వ్యవసాయం, అనుబంధ రంగాల్లో చేస్తున్న కృషికిగాను కామారెడ్డిలోని పీవీ నర్సింహారావు డెయిరీ టెక్నాలజీ కళాశాల డీన్ శరత్‌చంద్రకు ఈ అవార్డు దక్కింది. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డు అందుకున్నారు.

'మిల్లర్లు లక్ష్యం చేరుకోవాలి'



కామారెడ్డి క్రైం: జిల్లాలో రైస్ మిల్లర్లు ఎఫ్‌సీఐకి అప్పగించాల్సిన బియ్యం టార్గెట్ నెలాఖరులోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ చంద్రమోహన్ సూచించారు. శనివారం ఆయన బిచ్కుంద మండలకేంద్రంతోపాటు పిట్లం మండలంలోని తిమ్మానగర్, పిట్లంలలో ఉన్న రైస్‌మిల్లులను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిల్లింగ్‌లో వెనకబడిన రైస్ మిల్లుల యజమానులపై చర్యలు తీసుకుంటామన్నారు. లక్ష్యం పూర్తి చేయని మిల్లులను సీజ్ చేసి యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఎస్‌వో మల్లికార్జున్ బాబు, సివిల్ సప్లయ్స్ డీఎం అభిషేక్ సింగ్, రైస్ మిల్లుల యజమానులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

- 3,728 మంది పరీక్షకు హాజరు



నిజాంసాగర్: నిజాంసాగర్ జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశం కోసం శనివారం ప్రవేశపరీక్ష నిర్వహించారు. ఉమ్మడి నిజామబాద్ జిల్లావ్యాప్తంగా 27 కేంద్రాలలో పరీక్ష ప్రశాంతంగా జరిగిందని నవోదయ ప్రిన్సిపాల్ సత్యవతి తెలిపారు. ఆమె ఆర్మూర్ పట్టణంలోని పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. 2024–25 విద్యా సంవత్సరానికి గాను ఆరవ తరగతిలో ప్రవేశంకోసం 5,252 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని, పరీక్షకు 3,728 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు.



ఘాజీపూర్ జిల్లా జైలు నుంచి విడుదలైన మద్నూర్‌వాసులు(ఫైల్)



అద్వానీ రథయాత్రలో పాల్గొన్న మద్నూర్‌వాసులు(ఫైల్)



1990లో కామారెడ్డి ప్రాంతం నుంచి అయోధ్యకు తరలివెళ్లిన కరసేవకులు

అంతా రామమయం




దోమకొండ నుంచి అయోధ్యకు వెళ్లిన కరసేవకులు (ఫైల్)

- అయోధ్యలో భవ్య రామమందిరం... రేపే ప్రాణప్రతిష్ఠ సంబురం
- ఇప్పటికే ఇంటింటికీ చేరిన రామయ్య అక్షింతలు
- శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో పంపిణీ
- రేపు ఊరూవాడా ప్రత్యేక కార్యక్రమాలు
- దీపావళి జరుపుకునేందుకు సిద్ధమైన భక్తకోటి
- వ్యాపార, వాణిజ్య సంస్థల మూసివేతకు నిర్ణయం



అయోధ్యలో భవ్య రామ మందిరం.. ఐదు శతాబ్దాల కల. ఎన్నో పోరాటాల తర్వాత ఆ స్వప్నం సాకారమవుతోంది. అల అయోధ్యాపురిలో బాల రాముడు కొలువుదీరబోతున్నాడు. సోమవారం కౌసల్యానందనుడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించబోతున్నారు. ఈ వేడుకకు ఊరూవాడా సన్నద్ధమయ్యాయి. అంతటా పండుగ వాతావరణం నెలకొంది. ఇప్పటికే అయోధ్య నుంచి వచ్చిన రాములోరి పూజిత అక్షింతలు ఇంటింటికీ చేరాయి. సోమవారం నిర్వహించే విగ్రహ ప్రతిష్ఠాపన అపురూప ఘట్టాన్ని ప్రత్యక్షంగా వీక్షించడానికి పలువురు ఇప్పటికే అయోధ్యకు తరలివెళ్లగా.. చాలామంది ప్రత్యక్ష ప్రసారం ద్వారా కార్యక్రమాన్ని వీక్షించడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పుష్యమాసంలో దీపావళి పర్వదినాన్ని జరుపుకోవడానికి సిద్ధమయ్యారు.



సాక్షి, కామారెడ్డి: ధర్మ స్వరూపుడైన శ్రీరాముడి జన్మస్థలమైన అయోధ్యలో భవ్య మందిర నిర్మాణం కోసం భక్తులు ఐదు శతాబ్దాలుగా పోరాడుతున్నారు. ఆధునిక కాలంలో మూడున్నర దశాబ్దాల క్రితం జరిగిన కరసేవతో ఈ పోరాటం తారస్థాయికి చేరింది. జిల్లానుంచి వందలాది మంది అయోధ్యకు వెళ్లి కరసేవలో పాల్గొన్నారు. కొందరు అక్కడ అరెస్టై కొంత కాలం జైళ్లలో మగ్గారు. రామ మందిర నిర్మాణం కోసం బీజేపీ అగ్రనేత ఎల్‌కే అద్వానీ నిర్వహించిన రథయాత్రలో జిల్లాకు చెందిన పలువురు పాల్గొన్నారు. ఎట్టకేలకు అందరి పోరాటం ఫలించింది. భక్త జనం ఆకాంక్ష నెరవేరింది. కోర్టు తీర్పుతో ఐదు శతాబ్దాల కల ఆలయ రూపంలో సాక్షాత్కరించబోతోంది. శ్రీరామ జన్మభూమిలో సోమవారం బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ నిర్వహించనుండడంతో అంతటా పండుగ వాతావరణం నెలకొంది.

ఊరంతా పండుగ

అయోధ్యలో బాలరాముడి పూజిత అక్షింతలు అయోధ్య తీర్థ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఊరూరుకు చేరాయి. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో రామభక్తులు అక్షింతలకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రామగ్రామాన శోభాయాత్రలు నిర్వహించారు. స్థానికంగా ఆలయాల్లో పూజలు నిర్వహించిన అనంతరం ఇంటింటికీ వెళ్లి అందించారు. కులాలు, పార్టీలకు సంబంధం లేకుండా అన్ని వర్గాల వారు ఈ కార్యక్రమాలలో పాల్గొన్నారు. కామారెడ్డి పట్టణంలోని దళితవాడలో స్థానిక ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి అక్షింతలు, అయోధ్యరాముడి చిత్రపటాన్ని పంపిణీ చేశారు. భక్తులు వాటిని పరమపవిత్రంగా స్వీకరించి, పూజా మందిరంలో భద్రపరుచుకున్నారు. రామ మందిరం ప్రారంభోత్సవ రోజు కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

ఆలయాలు ముస్తాబు...

అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠాపన సుముహూర్తం సమీపిస్తుండడంతో వాడవాడలా సందడి నెలకొంది. ఈ పవిత్ర ఘట్టాన్ని పురస్కరించుకుని స్థానిక ఆలయాలను శుభ్రం చేశారు. భక్తులు తమ ఇంటి గోడలపై జై శ్రీరాం అన్న నినాదాలు రాశారు. అలాగే ఇళ్లపై కాషాయ జెండాలు కడుతున్నారు. వీధులన్నీ కాషాయమయంగా మారుతున్నాయి. విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు, కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రధానంగా రామాలయాలు, హనుమాన్ ఆలయాలను ముస్తాబు చేశారు. దోమకొండ మండల కేంద్రంలోని శివరాంమందిర్, మాచారెడ్డి మండలంలోని పోలోనిపల్లి రామాలయం, కామారెడ్డి పట్టణంలోని రామాలయం, ఎల్లారెడ్డి పట్టణంలోని పురాతన రామాలయం, రామారెడ్డి, పిట్లం తదితర ప్రాంతాల్లోని ఆలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

కామారెడ్డి ఎమ్మెల్యేకు దర్శన బాధ్యతలు...

అయోధ్యలో శ్రీరాముడి దర్శనం కోసం ఏర్పాటు చేసిన రాంమందిర్ దర్శన్ అభియాన్ రాష్ట్ర కన్వీనర్‌గా కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి నియమితులయ్యారు. ఈనెల 30 నుంచి మార్చి 31 వరకు రైళ్లలో అయోధ్య వెళ్లే భక్తులకు కావలసిన ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించనున్నారు. రోజూ రాష్ట్రం నుంచి ఐదు వేల మంది భక్తులు వెళ్లేలా ఏర్పాట్లు చేస్తున్నారు. రైళ్లలో వెళ్లే ప్రయాణికులకు మధ్యలో భోజన వసతి, అయోధ్యలో వసతి కల్పిస్తారు.

రేపు వ్యాపార, వాణిజ్య సంస్థలకు సెలవు


అయోధ్యలో రామ్ లల్లా విగ్రహ ప్రతిష్ఠాపన నేపథ్యంలో సోమవారం జిల్లాకేంద్రంలోని వ్యాపార, వాణిజ్య సంస్థలను మూసి ఉంచాలని కామారెడ్డి చాంబర్ ఆఫ్ కామర్స్ నిర్ణయించింది. ఈ నిర్ణయానికి వ్యాపార వర్గాలు సమ్మతి తెలిపాయి.

కరసేవకు తరలిన భక్తులు

దోమకొండ: 1990లో నిర్వహించిన కరసేవలో దోమకొండకు చెందిన పలువురు పాల్గొన్నారు. గ్రామానికి చెందిన పిన్నం రాంచంద్రం, రత్నాకర్, పెద్దిరాజు, బొడకుంటి కాశీనాథ్, పన్యాల మల్లికార్జున్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, రవి, శ్రీనివాస్, తదితరులు అయోధ్య వెళ్లి కరసేవలో పాల్గొన్నారు. కరసేవ అనంతరం మూడు దశాబ్దాల తర్వాత అయోధ్యలో రామమందిర నిర్మాణం జరుగుతుండడంపై వారు హర్షం వ్యక్తం చేశారు.

అయోధ్య రాంరెడ్డి..

భిక్కనూరు: లక్ష్మీదేవునిపల్లి గ్రామానికి చెందిన గడ్డం రాంరెడ్డి 1992లో కరసేవ కోసం అయోధ్య వెళ్లారు. అప్పటినుంచి ఆయన ఇంటిపేరు అయోధ్యగా మారిపోయింది. అందరూ ఆయనను 'అయోధ్య' రాంరెడ్డి అనే పిలిచేవారు. కరసేవ కోసం అయోధ్య వెళ్తానని రాంరెడ్డి తనయుడు సిద్దరాంరెడ్డి తెలపగా.. అందుకు నిరాకరించి తానే ఆ కార్యంలో పాల్గొంటానని రాంరెడ్డి గ్రామస్తులతో కలిసి వెళ్లారు. రామ జన్మభూమికి బయలుదేరే రోజు ఆయన పాదరక్షలు వదిలారు. ఆలయ నిర్మాణం జరిగేంతవరకు పాదరక్షలు ధరించనని ప్రతినబూనిన ఆయన.. మరణించేంతవరకు దానికి కట్టుబడి ఉన్నారు. కరసేవకు వెళ్లిన సమయంలో రాంరెడ్డి ఉత్తరప్రదేశ్‌లో తప్పిపోయారు.



గ్రామానికి చెందిన తోటి కరసేవకులు ఆయనకోసం నాలుగు రోజులపాటు వెతికినా ఆచూకీ లభించకపోవడంతో స్వగ్రామానికి తిరిగి వచ్చారు. రాంరెడ్డి మధ్యప్రదేశ్‌కు చెందిన కరసేవకులతో కలిసి భోపాల్ వెళ్లారు. అక్కడ కర్ఫ్యూ ఉండడంతో రైల్వే స్టేషన్‌లోనే చాలారోజులు ఉండిపోయారు. తర్వాత అక్కడివారు రైలు టికెట్టు ఇప్పించి నిజామాబాద్ పంపించారు. రాంరెడ్డి ఎట్టకేలకు 42 రోజుల తర్వాత స్వగ్రామానికి చేరుకున్నారు. 1993 నుంచి గ్రామంలో ఆయన శ్రీరామనవమి రోజున సీతారాముల కల్యాణం నిర్వహించడం ప్రారంభించారు. ఆలయానికి సీతారాములతోపాటు లక్ష్మణుడు, ఆంజనేయస్వామి విగ్రహాలను కొని ఇచ్చారు. ఆయన 2006లో మరణించారు.

ఆటంకాలను అధిగమించి..



మురళీధర్‌గౌడ్

కామారెడ్డి టౌన్: రామ జన్మభూమి విముక్తికోసం 1990లో జరిగిన కరసేవలో బీజేపీ వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జి, జిల్లా వాసి మురళీధర్ గౌడ్ పాల్గొన్నారు. ఆనాటి జ్ఞాపకాలను ఆయన పంచుకున్నారు. ఆ వివరాలు.. ''రామ జన్మభూమి విముక్తికోసం 1990లో అక్టోబర్ 23న రామజ్యోతిని పట్టుకుని అయోధ్యకు బయలుదేరాం. నేను వీహెచ్‌పీ గట నాయకుడిగా 16 మంది కరసేవకులతో కలిసి వెళ్లా. త్రివేణి సంగమం వద్ద ఉత్తర ప్రదేశ్ పోలీసులు మమ్మల్ని అడ్డుకుని ప్రతాప్‌గంజ్‌లోని ఓ పెద్ద కాలేజ్‌లో ఉంచారు. కాలకృత్యాలకని అబద్ధం చెప్పి ఒక్కొక్కరుగా తప్పించుకుని బయటకు వచ్చి అటవీ ప్రాంతం గుండా రామజన్మభూమివైపు కదిలాం. ఆకలితో ఉన్న మాకు స్థానికులు బెల్లం రొట్టెలు ఇచ్చారు. అక్టోబర్ 30 అయోధ్యకు చేరుకున్నాం. అక్కడ వాల్మీకి భవనంలో టైగర్ నరేంద్ర ప్రసంగం విన్నాం. నవంబర్ 2న సత్యాగ్రహ ర్యాలీలో పాల్గొన్నాం. పోలీసులు కాల్పులు జరపడంతో నా పక్కన ఉన్న రాజస్థాన్‌కు చెందిన రామ్ అనే కరసేవక్‌కు తుపాకీ గుండు తగిలి కుప్పకూలిపోయాడు. అతడిని భుజాన వేసుకుని వెళ్లి, వీహెచ్‌పీ వాళ్లకు అప్పగించాను. పోలీసులు బాష్ప వాయు గోళాలు మాపై వేస్తుంటే గోనె సంచులతో వాటిని పట్టుకుని, శ్వాసకు ఇబ్బందులు రాకుండా ఉల్లిగడ్డలను ముక్కు వద్ద పెట్టుకుంటూ ముందుకు కదిలాం. అప్పట్లో ములాయం సింగ్ ప్రభుత్వం కరసేవకులను కాల్చి చంపి నదిలో పడేసింది. సరయూ నదిలో కనిపించిన కరసేవకుల మృతదేహాలను చూసి భయమేసింది. అప్పటి రామ జన్మభూమి పోరాటంలో పాల్గొనందుకు గర్వంగా ఉంది. ఆ ఘటనలు జీవితంలో మరిచిపోలేనివి'' అని మురళీధర్ గౌడ్ పేర్కొన్నారు.



కామారెడ్డి నుంచి మురళీధర్‌గౌడ్ నేతృత్వంలో అయోధ్యకు వెళ్లిన కరసేవకులు (ఫైల్)

ఆనందంగా ఉంది..



బాన్సువాడ: 2020 ఆగస్టులో అయోధ్యలో రామ మందిర నిర్మాణం కోసం భూమి పూజ చేసినప్పటి నుంచి మద్యమాంసాలకు దూరంగా ఉంటున్నాను. అయోధ్యలో శ్రీరామ విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కోసం 108 రోజుల పాటు నిత్య అగ్నిహోమం(యజ్ఞం) చేశాను. విజయ తారక మంత్రం, హనుమాన్ చాలీసా పారాయణం, రామ రక్షా స్తోత్రం పఠించాను. ఐదు శతాబ్దాల పోరాటం ఫలించి, అయోధ్యలో భవ్య రామ మందిరం నిర్మాణమవుతున్నందుకు ఆనందంగా ఉంది.

–జంగిలి రాజు, ఉపాధ్యాయుడు, బాన్సువాడ



కామారెడ్డిలో అక్షింతల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కేవీఆర్ (ఫైల్)

14 రోజులు జైలులో ఉన్నాం..



మద్నూర్: 1990లో కరసేవ కోసం అయోధ్య వెళ్లాం. నాతో పాటు గ్రామానికి చెందిన దరాస్ సాయిలు, తమ్మెవార్ సుభాష్, సాయాగౌడ్ తదితరులు వచ్చారు. కరసేవకు వెళ్తున్నప్పుడు గ్రామంలో ర్యాలీ తీసి గ్రామపెద్దలు ఘనంగా సన్మానించారు. మమ్మల్ని ఉత్తరప్రదేశ్ పోలీసులు అరెస్టు చేసి 14 రోజులపాటు ఘాజీపూర్ జిల్లా జైలులో ఉంచారు. రామమందిర నిర్మాణం ఎప్పుడు జరుగుతుందా అని దశాబ్దాలుగా ఎదురుచూస్తున్నాం. ఆ కల నెరవేరుతున్నందుకు ఆనందంగా ఉంది.

– కాంశెట్టి శ్రీనివాస్, మద్నూర్‌వాసి

పూర్వజన్మ సుకృతం..



బిచ్కుంద: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి నాకు ఆహ్వానం అందింది. ఎంతో సంతోషంగా ఉంది. ఇది పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నా. మూడు రోజుల క్రితం అయోధ్యకు చేరుకున్నా. మందిర నిర్మాణం అద్భుతంగా ఉంది. రామ నామ స్మరణతో ఇక్కడి పరిసరాలు మారుమోగుతున్నాయి. విగ్రహ ప్రతిష్ఠాపనరోజు భక్తులంతా రామ నామాన్ని జపించాలి.

– సోమాయప్ప స్వామీజీ, బండాయప్ప మఠం పీఠాధిపతి, బిచ్కుంద

దోమకొండను రోల్‌మోడల్‌గా మారుస్తాం

- తెయూ రిజిస్ట్రార్ యాదగిరి
- గ్రామాభివృద్ధికి తెయూ సౌత్ క్యాంపస్, గడికోట ట్రస్టు మధ్య ఒప్పందం



ఒప్పంద పత్రాలను చూపుతున్న తెయూ రిజిస్ట్రార్, ట్రస్ట్ ప్రతినిధులు

దోమకొండ: చారిత్రక కట్టడాలున్న దోమకొండను అభివృద్ధిలో రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దడానికి కృషి చేస్తామని తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ యాదగిరి పేర్కొన్నారు. దోమకొండ అభివృద్ధి కోసం తెలంగాణ విశ్వవిద్యాలయం సౌత్‌క్యాంపస్, గడికోట ట్రస్టు మధ్య శనివారం ఒప్పందం కుదిరింది. దోమకొండ కోటలో నిర్వహించిన కార్యక్రమంలో ఒప్పంద పత్రాలపై సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌గౌడ్, రిజిస్ట్రార్ యాదగిరి, గడికోట ట్రస్టు సీనియర్ మేనేజర్ బాబ్జీ సంతకాలు చేశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ యాదగిరి మాట్లాడుతూ ఉన్నత విద్యలో చాలా మార్పులు వస్తున్నాయని, ప్రతి విద్యార్థిలో ఉన్న ప్రతిభను గుర్తించడానికి కార్యక్రమాలు రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. దోమకొండ అభివృద్ధికి ముందుకు వచ్చిన సౌత్ క్యాంపస్ అధ్యాపకులు, విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో సౌత్ క్యాంపస్ వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరి, జెడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, ఎంపీపీ శారద, సర్పంచ్ అంజలి, అధ్యాపకులు లలిత, అంజయ్య, మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

- కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: జిల్లాలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. శనివారం ఆయన కామారెడ్డిలోని హరిజనవాడ బాలికల పాఠశాల పోలింగ్ కేంద్రంలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 913 పోలింగ్ కేంద్రాలలో శని, ఆదివారాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ బూత్‌లలో బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారని, అర్హులు ఓటు హక్కుకోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మను చౌదరి, తహసీల్దార్ జనార్దన్ పాల్గొన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ పాటిల్



లింగంపేటలో అడిషనల్ కలెక్టర్..

చనిపోయిన ఓటర్ల పేర్లు తొలగించాలి

ఎల్లారెడ్డి/లింగంపేట: చనిపోయిన ఓటర్ల పేర్లను జాబితాలోంచి తొలగించాలని అడిషనల్ కలెక్టర్ చంద్రమోహన్ సూచించారు. శనివారం ఆయన ఎల్లారెడ్డి మున్సిపల్ కార్యాలయం, లింగంపేట బాలుర ఉన్నత పాఠశాలల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండుచోట్ల ఓటు హక్కు ఉన్న వారిని గుర్తించి వారి అభీష్టం మేరకు ఒక ప్రాంతంలో ఓటు హక్కు తొలగించాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ఓటుహక్కు కోసం నమోదు చేసుకునేలా చూడాలన్నారు. ఆయన వెంట ఆర్డీవో ప్రభాకర్, తహసీల్దార్లు మహేందర్ కుమార్, సుధాకర్, మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, కార్యదర్శులు శ్రవణ్ కుమార్, యూసుఫ్, విఠల్, సౌమ్య ఉన్నారు.

క్లుప్తంగా

'ప్రజాపాలన'లో ఎంపీడీవో చేతివాటం

■ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ఎంపీపీ

లింగంపేట: ప్రజాపాలన కార్యక్రమ నిర్వాహణ కోసం ప్రభుత్వం కేటాయించిన నిధుల్లో ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి చేతివాటం ప్రదర్శించారని ఎంపీపీ గరీబున్నిసాబేగం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై శనివారం ఆమె ఎంపీడీవో కార్యాలయంలో మాట్లాడారు. ఎంపీడీవో రూ.లక్ష వరకు అవినీతికి పాల్పడినట్లు ఆమె ఆరోపించారు. మండలంలోని 41 పంచాయతీలకు ప్రభుత్వం రూ.10వేల చొప్పున విడుదల చేసింది. ఈ క్రమంలో కొన్ని జీపీల కార్యదర్శులకు ఎంపీడీవో రూ.పది వేలు కాకుండా తక్కువ ఇచ్చినట్లు ఆమె ఆరోపించారు.

యూనివర్సిటీ క్రాస్ కంట్రీ జట్ల ఎంపికలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ అంతర కళాశాలల పురుషులు, మహిళల క్రాస్ కంట్రీ (10 కిలోమీటర్లు) చాంపియన్‌షిప్‌–2024 ఎంపిక పోటీలను శనివారం వర్సిటీ క్రీడా మైదానంలో నిర్వహించినట్లు డైరెక్టర్ జి.బాలకిషన్ తెలిపారు. పోటీల్లో తెయూ పరిధిలోని నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల నుంచి అనుబంధ డిగ్రీ కళాశాలల అథ్లెటిక్స్ సుమారు 40 మంది పాల్గొన్నట్లు తెలిపారు. ఎంపికైన జట్ల క్రీడాకారులు ఫిబ్రవరి 10, 11వ తేదీల్లో మహారాష్ట్ర నాందేడ్ శ్రీరామానందతీర్థ మరట్వాడా వర్సిటీలో నిర్వహించనున్న ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని డైరెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో వర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ బీఆర్ నేత, వివిధ కళాశాలల పీడీలు బాలమణి, అనిల్, ప్రవీణ్, రాజేందర్, జూనియర్ అసిస్టెంట్ నరేశ్ మల్లికార్జున్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులు వీరే..

పురుషుల విభాగం: కె.అనిల్, కె.నాగరాజు (టీటీడబ్ల్యూఆర్‌డీసీ, కామారెడ్డి), డి.జ్ఞానేశ్వర్, జె.బందు నాయక్, ఎస్.వెంకుల్, కె.వినోద్ (గిరిరాజ్ డిగ్రీ కాలేజ్, నిజామాబాద్)

మహిళల విభాగం : బి.హరిత, ఎం.అంకిత (ప్రభుత్వ డిగ్రీ కాలేజ్, కామారెడ్డి), జి.మౌనిక, జె.శ్రీ వర్ష (ప్రభుత్వ గిరిరాజ్ డిగ్రీ కాలేజ్, నిజామాబాద్), జి.రోజాభీ, ఎస్.దీక్ష (టీఎస్‌డబ్ల్యూఆర్‌డీసీ(డబ్ల్యూ), నిజామాబాద్).

న్యాయశాఖ ఉద్యోగులకు క్రీడలు



కామారెడ్డి క్రైం: రిపబ్లిక్ డేను పురస్కరించుకుని శనివారం కామారెడ్డి జిల్లా కోర్టు ప్రాంగణంలో న్యాయశాఖ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహించారు. క్రీడలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్ఎన్ శ్రీదేవి ప్రారంభించారు. అదనపు జిల్లా న్యాయమూర్తి లాల్ సింగ్ శ్రీనివాస్ నాయక్, సీనియర్ సివిల్ జడ్జి టి నాగరాణి, న్యాయశాఖ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు జమాల్పూర్ భుజంగరావు, నిమ్మ వెంకట్ రెడ్డి, నాగేంద్ర, శ్రీధర్, రమేశ్‌గౌడ్, రవీందర్, సాయి కృష్ణ, ఆనంద్, మారుతి పాల్గొన్నారు.

తెయూ తెలుగు విభాగాధిపతిగా లక్ష్మణ్‌చక్రవర్తి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ తెలుగు విభాగాధిపతి(హెచ్‌వోడీ)గా డాక్టర్ సీహెచ్ లక్ష్మణచక్రవర్తి నియామకమయ్యారు. వర్సిటీ ఇన్‌చార్జి వీసీ బి.వెంకటేశం ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.యాదగిరి శనివారం తన చాంబర్‌లో లక్ష్మణ్ చక్రవర్తికి నియామక ఉత్తర్వులు అందజేశారు. హెచ్‌వోడీగా నియామకమైన లక్ష్మణచక్రవర్తికి తెలుగు శాఖ అధ్యాపకులతో పాటు ఇతర విభాగాల అధ్యాపకులు శుభాకాంక్షలు తెలిపారు.


రామమందిర కల.. నెరవేరుతున్న వేళ..



500 ఏళ్ల అయోధ్య రామ మందిర కల నెరవేరుతోంది. ఆలయ నిర్మాణ కోసం కోట్ల మంది భక్తులు పరితపించారు. ఆ క్షణం మరికొద్ది గంటల్లో ఆవిష్కృతం కాబోతోంది. ఈ నేపథ్యంలో నాడు కరసేవకు వెళ్లిన వారితో పాటు జిల్లా వాసుల మనోగతం..



మద్నూర్ నుంచి కరసేవకు వెళ్తున్న యువకులు (ఫైల్)



1990లో అయోధ్యకు వెళ్లిన కరసేవకులు(ఫైల్)

కరసేవ కోసం అయోధ్య వెళ్లా



భిక్కనూరు: 1992లో నిర్వహించిన కరసేవ కోసం అయోధ్యకు వెళ్లాను. మా గ్రామం నుంచి ఒక్కడినే వెళ్లగా.. రామేశ్వర్‌పల్లి, లక్ష్మీదేవునిపల్లికి చెందిన పలువురు వచ్చారు. వివాదాస్పద నిర్మాణాన్ని కూల్చిన రోజున అక్కడే ఉన్నా. పారామిలటరీ దళాలు అడ్డుకున్నా జైశ్రీరాం అంటూ ముందుకెళ్లాం.

–రాంరెడ్డి, కరసేవకుడు, ర్యాగట్లపల్లి

ఎన్నో ఏళ్ల కల



బిచ్కుంద(జుక్కల్): రామ జన్మ భూమి ట్రస్టు పిలుపు మేరకు 1990, 1992లో కరసేవకుడిగా అక్కడికి వెళ్లినందుకు చాలా గర్వపడుతున్నా. మండలం నుంచి 20 మంది వెళ్లాం. ఎన్నో ఏళ్ల నుంచి ఎదురు చూస్తున్న భవ్య రామ మందిరం కల నెరవేరబోతోంది. 22న బిచ్కుంద ఆలయంలో నిర్వహించనున్న ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొననున్నాం.

– దర్పల్ దశరథ్, కరసేవకుడు, బిచ్కుంద

అదృష్టంగా భావిస్తున్నా..



మాచారెడ్డి: అయోధ్యలో రాములోరి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపన సందర్భంగా అక్షింతలు పంపిణీ చేయ డం అదృష్టంగా భావిస్తు న్నా. రామాలయం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని వీక్షించడానికి నా వంతుగా స్థానిక వీరహనుమాన్ వేంకటేశ్వ రాలయంలో ఏర్పాట్లు చేయిస్తున్నాను.

– పిట్ల కృష్ణంరాజు, మాచారెడ్డి చౌరస్తా

సరయూ నది వద్ద కాల్పులు



భిక్కనూరు: అయోధ్యలో 1990లో నిర్వహించిన శిలాన్యా స్‌లో పాల్గొన్నాను. కరసేవకుల ను అడ్డుకున్నా అడవిలో నుంచి పొలాల మీదుగా అయోధ్య సరయూ నది వద్దకు చేరుకున్నాం. అక్కడ పోలీసులు విచక్షణా రహితంగా కాల్పులు జరిపారు. చాలామంది కరసేవకులు మృతి చెందారు. కరసేవకుల రక్తం నదిలో ప్రవహించడం చూసి కన్నీళ్లు ఆగలేదు. రామమందిరం నిర్మాణ కల ఇప్పటికి నెరవేరుతోంది.

–రవీందర్‌రెడ్డి, రామేశ్వర్‌పల్లి

నిజమైన పండుగ



రాజంపేట: రామాలయ నిర్మాణం కోసం జరిగిన న్యాయ పోరాటం గెలిచింది. చరిత్ర సత్యాలు అందరికీ తెలిసిందే. రామమందిర నిర్మాణం కోసం పార్టీలకతీతంగా చందాలు సేకరించాం. రామ మందిరం ప్రారంభోత్సవం ప్రజలందరికీ నిజమైన పండుగ.

– రాజాగౌడ్, స్వదేశీ జాగరణ మంచ్ ఇందూర్ విభాగ్ సహ సంయోజక్

ప్రతిఒక్కరూ పులకించే రోజు



పిట్లం: రామాలయ ప్రారంభోత్సవం ప్రతిఒక్కరి మనస్సు పులకించే రోజు. కార్యక్రమాన్ని కళ్లారా చూసే భాగ్యం లభించడం నా పూర్వ జన్మ సుకృతం. రామాలయ ప్రారంభోత్సవం రోజు కుటుంబ సభ్యులందరం కలిసి ఆలయంలో పూజా కార్యక్రమాల్లో పాల్గొంటాం. ఆ రోజు ఓ పండుగలా జరుపుకుంటాం.

– బిజుగం సంతోషి, పిట్లం

18 రోజులు జైల్లో ఉన్నాను



ఎల్లారెడ్డి : 1990 సంవత్సరంలో రామమందిర పోరాటంలో భాగంగా అయోధ్యలో కరసేవకు వెళ్లాను. నాడు ఉత్తరప్రదేశ్ పోలీసులు మమ్మల్ని అడ్డుకుని అరెస్టు చేసి ఘాజీపూర్ జైల్‌లో 18 రోజులు ఉంచారు. అనంతరం విడుదల చేయడంతో తిరిగి ఎల్లారెడ్డికి రావడం జరిగింది. ప్రస్తుతం రామాలయ నిర్మాణం చేపట్టి ప్రారంభోత్సవం నిర్వహిస్తుండడం ఎంతో సంతోషంగా ఉంది.

– నాయిని సాయిరాములు ఎల్లారెడ్డి

ఇంటింటికి పంపిణీ



ఎల్లారెడ్డి: మండలంలోని అన్ని గ్రామాలతో పాటు పట్టణంలోని అందరి ఇళ్లకు అయోధ్య రాముడి అక్షింతలు పంపిణీ చేశాం. సోమవారం అయోధ్య రాముడి ప్రతిష్ఠాపన అనంతరం రామాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నాం. శ్రీరామ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం చేయనున్నాం.

– వినోద్, బజరంగ్‌దళ్ నాయకుడు, ఎల్లారెడ్డి

పది బృందాలతో కలిసి..



సదాశివనగర్: మా గ్రామంలో పది మంది బృందాల భక్తులతో కలిసి 1,852 కుటుంబాలకు అక్షింతలను పంపిణీ చేశాం. భక్తి, శ్రద్ధలతో ఇంటింటికి తిరిగి అందజేశాం. ఇందులో గ్రామస్తుల సహకారం ఎంతో ఉంది. ఈ నెల 22న జరిగే ప్రతిష్ఠాపన కార్యక్రమం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. ఉదయం నుంచి భజనలు చేయనున్నాం.

–కొప్పుల నర్సారెడ్డి, సదాశివనగర్

ప్రతి ఊరికి అక్షింతలు



రామ జన్మభూమి నుంచి వచ్చిన రాములోరి అక్షింతలు అయోధ్య నుంచి మా దగ్గరికి రావడం అదృష్టంగా భావిస్తున్నాం. ఈ అక్షింతలను మండలంలోని ప్రతి గ్రామానికి పంపించాం. ప్రతి ఇంటికి రాములోరి అక్షింతలు చేరేటట్లు ఏర్పాట్లు చేశాం. రాములవారి విగ్రహ ప్రాణప్రతిష్ఠాపన సందర్భంగా గ్రామాల్లోని ఆలయాలను ముస్తాబు చేశాం. పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నాం.

–నరేశ్, మద్నూర్

గ్రామస్తుల సహకారంతో..



సదాశివనగర్: అయోధ్యలో రాములోరి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో ఏర్పాట్లు పూర్తి చేశాం. గ్రామంలో ఇంటింటికి అక్షింతలు పంపిణీ చేసి జైశ్రీరాం నినాదాలు రాశాం. ఈ నెల 22న వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నాం. అలాగే అన్నదానం ఏర్పాటుకు దాతల సహకారం తీసుకున్నాం.

–కందడి సాయిరెడ్డి, పద్మాజీవాడి

కళ్లారా చూడబోతున్నాను



నస్రుల్లాబాద్: అయోధ్యలో రామ మందిర ప్రారంభోత్సవ మహత్యాన్ని కళ్లారా చూడబోతున్నాను. 1992 కరసేవక్‌గా వెళ్లిన నాకు రామాలయ నిర్మాణం జరగడం చాలా ఆనందంగా ఉంది. ఎంతో మంది తమ జీవితాల్ని త్యాగం చేశారు. వారి ఆత్మకు శాంతి చేకూరుతుంది.

–బోధన్ నారాయణ, నస్రుల్లాబాద్

వెయ్యికళ్లతో ఎదురుచూస్తున్నాం



నాగిరెడ్డిపేట: మండలంలోని అన్ని గ్రామాలకు అక్షింతలను పంపిణీ చేశాం. పంపిణీ కోసం ప్రతి గ్రామంలో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశాం. గ్రామాల్లో ఘనస్వాగతం పలికి ఇంటింటికి తిరిగి అక్షింతలను పంపిణీ చేశారు. దీంతో పాటు గ్రామాల్లో ప్రతి ఇంటికి జై శ్రీరామ్ ముద్రలను వేశాం. అయోధ్య రామమందిర ప్రారంభోత్సవం కోసం వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నాం.

– భూపతి రాజు, నాగిరెడ్డిపేట

500 ఏళ్ల కల సాకారం



నిజాంసాగర్: ఐదు వందల ఏళ్ల కల సాకారం కాబోతోంది. గతంలో ఎన్నో ప్రభుత్వాలు, పాలకులు మందిర నిర్మాణం కాలేదు. ప్రస్తుతం ప్రధాని మోదీ పాలనలో రామ మందిర ప్రారంభోత్సవ జరగడం ఎంతో సంతోషకరం. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, దీపారాధనలు, అన్నదాన కార్యక్రమాలు చేపడతాం.

–శ్రీనివాస్, మహమ్మదాబాద్, జుక్కల్ మండలం

15 రోజులు జైల్లో గడిపాం



లింగంపేట: 1990లో మండలం నుంచి 18 మంది కరసేవకులం హైదరాబాద్ నుంచి రైల్‌లో బయలుదేరాం. వారణాసి సమీపంలో తాము ప్రయాణిస్తున్న రైలుపై దుండగులు దాడి చేశారు. రైలు నుంచి దిగి కాలినడకన గంగానది దాటి కాశీ ప్రయాగ వెళ్లాం. తిరిగి కాశీకి వచ్చే క్రమంలో పోలీసులు తమను అరెస్టు చేసి జైల్లో పెట్టారు. 15 రోజుల తర్వాత బయటకు వచ్చి అయోధ్య చేరుకుని రాముడిని దర్శించుకున్నాం. ప్రస్తుతం మాకళ్ల ముందే రామమందిరం నిర్మాణం కావడం గర్వంగా ఉంది.

– మురళి, లింగంపేట

లాఠీ దెబ్బలు తిన్నాం



లింగంపేట: 1989 సంవత్సరంలో రామశిల, రామజ్యోతి కార్యక్రమాల కోసం ఇంటింటికి తిరిగాం. 1990 సంవత్సరంలో లింగంపేట మండలం నుంచి మొదట 18 మంది కరసేవకులం అయోధ్యలో కరసేవకు వెళ్లాం. మార్గ మధ్యలో ఎన్ని ఒడుదుడుకులు ఎదురైనా రామమందిరాన్ని దర్శించుకున్నాం. మార్గ మధ్యలో రాళ్ల దెబ్బలు, లాఠీ దెబ్బలు తిన్నాం. అయినా వెనుకడుగు వేయకుండా అయోధ్య చేరుకున్నాం. రామమందిర పోరాటంలో భాగమవడం ఆనందంగా ఉంది. రామ మందిరం ప్రారంభోత్సవం కానుండడంతో మా కల నెరవేరింది.

– పెద్ది శివ్వయ్య, లింగంపేట

చిన్ననాటి కల నెరవేరింది



భిక్కనూరు: అయోధ్యలో రామమందిరం నిర్మాణ కల నెరవేరడంతో ఎంతో సంతోషంగా ఉంది. 1990లో అయోధ్యలో నిర్వహించిన శిలన్యాస్ కార్యక్రమంలో పాల్గొన్నాను. అప్పటి యూపీ సీఎం ములాయం సింగ్‌యాదవ్ కరసేవకులపై లాఠీచార్జీ, కాల్పులు చేయించాడు. ఆ సమయంలో త్రుటిలో తప్పించుకున్నాను. రామ మందిర నిర్మాణం వల్ల దేశం సుఖ శాంతులతో విలసిల్లుతుంది.

– మధుసూదన్‌రెడ్డి, కరసేవకుడు, రామేశ్వర్‌పల్లి

దేశానికి పండుగ రోజు



పిట్లం : అయోధ్య రామమందిర ప్రారంభోత్సవం దేశానికి పండుగ రోజు. అయోధ్యలో శ్రీరాముడి భవ్యమందిరం నిర్మించడం ఎంతో ఆనందకరం. మందిర నిర్మాణం కోసం లక్షల మంది భక్తులు పోరాటం చేశారు. ఇప్పటికి 500 ఏళ్ల కల నెరవేరబోతోంది. ఇది ప్రపంచంలో ఉన్న ప్రతి హిందువు సంతోషకమైరన విషయం.

– రాము, శ్రీరామ తీర్థక్షేత్ర ట్రస్ట్ సభ్యుడు, పిట్లం

అయోధ్య రాముడిని దర్శించుకుంటా



తాడ్వాయి: రామమందిరం శ్రీరాముడి ప్రాణప్రతిష్ఠాపన సందర్భంగా ఊరూవాడా రామమయం కానుంది. త్వరలో అయోధ్యకు వెళ్లి రాములవారిని దర్శనం చేసుకుంటాను. వందల ఏళ్ల తర్వాత రామమందిరం ప్రారంభోత్సవం కాబోతుండడం ఎంతో ఆనందంగా ఉంది.

– ఏనుగు రాఘవరెడ్డి, తాడ్వాయి

ప్రతి ఇంటా దీపారాధన



తాడ్వాయి: రామజన్మభూమిలో శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠాపన సందర్భంగా ప్రతి ఇంటా దీపారాధన నిర్వహించనున్నాం. ఆలయాల్లో హనుమాన్ చాలీసా, సుందరకాండ, రామస్తోత్రం వంటివి పారాయణం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రజలందరూ ఈ వేడుకను జరుపుకోవాలి.

– గొల్ల నవీన్, తాడ్వాయి

బీసీ స్టడీ సర్కిల్‌లో ఉచిత కోచింగ్

కామారెడ్డి అర్బన్: నిజామాబాద్‌లోని బీసీ స్టడీ సర్కిల్‌లో వచ్చేనెల ఒకటో తేదీనుంచి ఉచిత గ్రూప్ 1, 2, 3, 4 ఫౌండేషన్ కోర్సు తరగతులు ప్రారంభం కానున్నాయి. ఈ విషయాన్ని స్టడీ సర్కిల్ డైరెక్టర్ సీహెచ్ వెంకన్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హతగల అభ్యర్థులు ఈనెల 24లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాలకు 08462–241055 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ముగిసిన ఏబీవీపీ యువజన వారోత్సవాలు

కామారెడ్డి టౌన్: యువజన వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్ మైదానంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలు శనివారం ముగిశాయి. మూడు రోజులుగా కబడ్డీ, వాలీబాల్, వ్యాసరచన అంశాలలో పోటీలు నిర్వహిస్తున్నారు. శనివారం ముగింపు కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ జిల్లా సంఘచాలక్ బొడ్డు శంకర్, జిల్లా ప్రచారక్ హరి, ఏబీవీపీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు రంజిత్ మోహన్, ఆయా సంస్థల ప్రతినిధులు మారుతి, జైపాల్‌రెడ్డి, మోటూరి శ్రీకాంత్, అవధూత నరేందర్, గిరి, మనోజ్, స్వామి, కృష్ణ, రోహిత్ పాల్గొన్నారు.



వాలీబాల్ విజేతతో ఏబీవీపీ పూర్వ నేతలు

క్రైం కార్నర్

నేడు ఆర్మీ లాంఛనాలతో రవిచంద్ర అంత్యక్రియలు



రవిచంద్ర (ఫైల్)

మాక్లూర్: రైలు ప్రమాదంలో శుక్రవారం మృతి చెందిన మండలంలోని చిక్లి క్యాంప్‌కు చెందిన ఆర్మీ జవాన్ రవిచంద్ర అంత్యక్రియలు ఆదివారం ఆర్మీ లాంఛనాలతో జరుగనున్నట్లు మృతుడి కుటుంబ సభ్యులు శనివారం తెలిపారు. వివరాలు.. రవిచంద్ర జమ్ము కాశ్మీర్‌లోని ఎయిర్ ఫోర్స్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. అతడి భార్య శ్రీహర్ష సంక్రాంతి పండుగకు తన పుట్టింటికి ఏపీలోని పల్నాడు జిల్లా పిడుగురాళ్లకు వెళ్లింది. సెలవుపై వచ్చిన రవిచంద్ర భార్య పిల్లలను తీసుకుని వచ్చేందుకై శుక్రవారం సికింద్రాబాద్‌లో కాకినాడ ఎక్స్‌ప్రెస్ ఎక్కాడు. పిడుగురాళ్ల రైల్వే స్టేషన్‌లో రైలు నుంచి జారిపడి గాయపడ్డాడు. ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతదేహాన్ని శనివారం చిక్లి క్యాంప్‌కు తీసుకొచ్చారు.

యువతి అదృశ్యం

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని గోసంగి కాలనీకి చెందిన 19 ఏళ్ల యువతి అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి శనివారం తెలిపారు. శుక్రవారం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించినా ఆచూకీ దొరకలేదు. ఆమె ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ చేసి ఉంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో భారీ చోరీ

● రూ.8 లక్షల విలువైన సొత్తు అపహరణ



విచారణ జరుపుతున్న పోలీసులు

కామారెడ్డి క్రైం: దైవ దర్శనం కోసం తిరుపతి వెళ్లిన కుటుంబం ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటన జిల్లా కేంద్రంలోని ఆర్య నగర్ కాలనీలో శనివారం వెలుగు చూసింది. కాలనీలో నివాసం ఉండే తన్నీరు శేఖర్ ఓ బీడీ కంపెనీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన తన కుటుంబంతో కలిసి ఈ నెల 18న తిరుపతికి వెళ్లాడు. శనివారం ఉదయం అతని ఇంటి తాళాలు పగలగొట్టి ఉండడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి ఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. క్లూస్‌టీం బృందాన్ని పిలిపించి ఆధారాలు సేకరించారు. ఇంట్లో దాచి ఉంచిన రూ.3.50 లక్షల నగదు, మూడున్నర తులాల బంగారం, రెండు కిలోల వెండి వస్తువులు, రెండు ల్యాప్‌టాప్‌లు చోరీకి గురైనట్లు శేఖర్ బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌హెచ్‌వో తెలిపారు.

కాపర్ వైర్, ఆయిల్..

నిజాంసాగర్: మండల కేంద్రంలోని బంజపల్లి శివారులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం రాత్రి దొంగలు ధ్వంసం చేసి కాపర్ వైరు, ఆయిల్ చోరీ చేశారు. విషయం తెలుసుకున్న ట్రాన్స్‌కో ఏఈ లక్ష్మణ్, లైన్‌మన్ సుదర్శన్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. చోరీ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఏఈ తెలిపారు.



ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న ఏఈ లక్ష్మణ్

వంద క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

సిరిసిల్ల రోడ్డులో ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని సిరిసిల్ల రోడ్డులో అక్రమంగా రేషన్ బియ్యాన్ని సరఫరా చేస్తున్నారనే సమాచారం రావడంతో సివిల్ సప్లయ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. వెంకటరమణ అనే వ్యాపారి దాదాపు 100 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని నూకలుగా మార్చి ఓ డీసీఎంలో ఇతర ప్రాంతాలకు రవాణా చేసేందుకు సిద్ధంగా ఉంచినట్లు గుర్తించారు. సదరు వ్యాపారిపై గతంలోనూ పలు పీడీఎస్ అక్రమ రవాణా కేసులు న్నాయి. డీసీఎంను స్వాధీనం చేసుకుని పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ కిష్టయ్య మాట్లాడుతూ.. పీడీఎస్ బియ్యాన్ని నూకలుగా మార్చి సరఫరా చేస్తున్నారని సమాచారం వచ్చిందన్నారు. దాదాపు 200 బస్తాల్లో నింపిన 100 క్వింటాళ్ల వరకు నూకలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేశామన్నారు.



డీసీఎంను స్వాధీనం చేసుకున్న అధికారులు

చికిత్స పొందుతూ ఒకరి మృతి



శేఖర్(ఫైల్)

మాక్లూర్: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మండలంలోని చిక్లి గ్రామానికి చెందిన కుషపు శేఖర్(33) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. సంక్రాంతి సెలవులు రావడంతో సదాశివనగర్ గురుకుల పాఠశాలలో చదువుతున్న పిల్లలను తీసుకువచ్చేందుకు శేఖర్ ఈనెల 11న చిక్లి నుంచి బైక్‌పై వెళ్లాడు. సదాశివనగర్ శివారులో ఎదురుగా వస్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో రెండు కాళ్లు పూర్తిగా విరిగిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే 108లో కామారెడ్డి జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య భూలక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

